జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం 13-4-2026 శ్రీకాకుళం సంపుటి: 3 సంచిక: 644 పేజీలు: 4 వెల : రూ.7

# పొత్తు ధర్మానికి.. తూట్లు!

* కార్గిల్ పార్కు, నేతాజీ విగ్రహానికి సుడా నిధులు * పార్కు, విగ్రహాన్ని ప్రారంభించిన టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే * జనసేన నేత, సుడా చైర్మన్‌కు అందని ఆహ్వానం * జనసేన, బీజేపీ నాయకులకు పిలవని టీడీపీ నేతలు * గుర్రుగా బీజేపీ, జనసేన శ్రేణులు * అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లిన జనసేన నాయకులు





**శ్రీకాకుళం, ఏప్రిల్ 12 (వార్త):** రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేనలు కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో నిలిచి గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం అమలు చేసినా పొత్తూ ధర్మాన్ని పాటిస్తూ ముందుకువెళుతోంది. అయితే శ్రీకాకుళం జిల్లాలో మాత్రం ఈ పొత్తు ధర్మాన్ని టీడీపీ నాయకులు పక్కన పెట్టేశారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో పలు కార్యక్రమాలకు బీజేపీ, జనసేన నేతలకు టీడీపీ నాయకులు కనీసం పిలవడం మానేశారు. దీంతో ఈ రెండు పార్టీల నాయకులు టీడీపీపై గుర్రుగా ఉన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే జనసేన నాయకులు తమ అధినేత దృష్టికి సైతం తీసుకువెళ్లారు. పొత్తూ ధర్మాన్ని పాటించడం లేదని, కనీసం తాము ఉన్నామని కూడా టీడీపీ నాయకులు గుర్తించడం లేదని వాపోతున్నారు. జిల్లాలో జనసేన పార్టీకి కొన్ని మండలాల్లో గట్టిగా పట్టు ఉంది. ఈ పార్టీ ఎక్కడ బలపడిపోతుందోనని టీడీపీ నాయకులు వారిని సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు పిలవడం లేదు. దీనికితోడు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున జనసేన ఒక పథకం ప్రకారం ముందుకు వెళుతోంది. పొత్తు ధర్మం ప్రకారం ఈ ఎన్నికల్లో ఎక్కువ పంచాయతీలు వారికి ఇవ్వాల్సింది ఉంటుందోనని టీడీపీ నేతలు తమను పక్కన పెడుతున్నట్టు కొందరు జనసేన నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో జనసేన కొంత బలంగానే ఉంది. సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, ఆ పార్టీకి చెందిన పట్టున్న నాయకులు కొరికాన భవానీలు పాతపట్నం నియోజకవర్గంలో పార్టీని బలపరుచుకుంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను టీడీపీకి చెందిన కొందరు చించివేయడంతో టీడీపీ, జనసేన మధ్య కొంత వివాదం చెలరేగింది. ఇటీవల హిరమండలం జనసేన నేతపై టీడీపీకి చెందిన కొందరు దురుసుగా ప్రవర్తించారు. ఈవిషయాలు జనసేనాని దృష్టికి సైతం ఆ పార్టీ శ్రేణులు తీసుకువెళ్లారు. ఇక సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ కృషితో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్మించిన కార్గిల్ పార్కును, కొత్తరోడ్డు వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోష్ విగ్రహాన్ని ఆయన లేకుండానే ప్రారంభించేశారు. వీటిని సుడా నిధులతోనే ఏర్పాటు చేసినప్పటికీ చైర్మన్‌ను పిలవకపోవడం, ప్రోటోకాల్ పాటించకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. జనసేనతో పాటు బీజేపీని సైతం టీడీపీ నాయకులు విస్మరించడం పట్ల ఈ రెండు పార్టీలకు చెందిన గుర్రుగా ఉన్నాయి. ఇదిలానే కొనసాగితే మున్ముందు టీడీపీతో కలిసి పనిచేయలేమని అధిష్టానం దృష్టికి జనసేన, బీజేపీ నాయకులు తీసుకువెళ్లినట్టు భోగట్టా.

* ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం రోడ్డు నుంచి * ఆదివారం సాయంత్రం 4.55కు తిరుపతి నుంచి * హంసఫర్ రైలులో థర్డ్ ఏసీ, స్లీపర్ కోచ్‌లు * శ్రీకాకుళం రోడ్డులో ప్రారంభించనున్న కేంద్ర మంత్రి రామ్మోహన్








# శ్రీకాకుళం టు తిరుపతి రైలు.. నేడు ప్రారంభం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 12 (వార్త):** కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి ఫలితంగా శ్రీకాకుళం నుండి తిరుపతికి మొట్టమొదటి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీసు మంజూరైంది. దీనికి సంబంధించి రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేస్తూ 17439/40 తిరుపతి - శ్రీకాకుళం రోడ్ హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 13నుండి ప్రారంభించనుంది. ఈ రైలు ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుండి, ప్రతి సోమవారం మధ్యాహ్నం శ్రీకాకుళం రోడ్ నుండి ప్రయాణిస్తుంది. ఇప్పటివరకు శ్రీకాకుళం జిల్లా ప్రజలు.. భువనేశ్వర్ నుండి ప్రారంభమయ్యే రైలు సర్వీసులపైనే ఆధారపడేవారు. మరోవైపు విశాఖపట్నం మీదుగా తిరుమల దర్శనం కోసం ప్రయాణించి రద్దీ, ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అయితే ఈ కొత్త సర్వీసుతో భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం, ఎక్కువ బెర్త్‌లు అందుబాటులోకి వస్తాయి. ఈ నూతన సర్వీసును 13న శ్రీకాకుళం రోడ్ స్టేషన్ నుండి ప్రారంభించబోతున్నారు.

## శ్రీకాకుళం-తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్ టైమింగ్స్..

శ్రీకాకుళం నుంచి నేరుగా తిరుపతికి వెళ్లే ప్రయాణికుల కోసం వారానికోసారి రాకపోకలు సాగించే హం సఫర్ ఎక్స్‌ప్రెస్ ఏయే స్టాప్‌లలో ఆగబోతోంది, కోచ్‌లు, ఇతర వివరాలను రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ రైలు శ్రీకాకుళం నుంచి బయలుదేరి తిరుపతికి చేరుకోనుంది. అయితే ఇది వారానికోసారి మాత్రమే రాకపోకలు సాగించనుంది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి ఓ రైలు, మళ్లీ తిరుపతి నుంచి శ్రీకాకుళానికి మరో రైలు రాకపోకలు సాగిస్తాయి.




23. REGULARISATION OF 07481/07482 TOD SPECIAL AS 17439/17440 TIRUPATI - SRIKAKULAM ROAD HUMSAFAR EXPRESS:

| 17439 TIRUPATI - SRIKAKULAM ROAD HUMSAFAR EXPRESS | ↓ | STATION | ↑ | 17440 SRIKAKULAM ROAD - TIRUPATI HUMSAFAR EXPRESS |
|---|---|---|---|---|
| 16:00 (SUN) | D | TIRUPATI | A | 08:10 (TUE) |
| 09:38/40 | A/D | DUVVADA | A/D | 18:05/07 |
| 12:30 (MON) | A | SRIKAKULAM | D | 15:00 (MON) |

| | |
|---|---|
| COMMERCIAL STOPPAGES | RENIGUNTA, GUDUR, NELLORE, ONGOLE, CHIRALA, BAPATLA, TENALI, VIJAYAWADA, ELURU, RAJAHMUNDRY, SAMALKOT, ANAKAPALLE, YELLAMANCHILI, DUVVADA, SIMHACHALAM NORTH, PENDURTI, KOTTAVALASA, VIZIANAGARAM, CHIPURUPALLE |
| FREQUENCY | WEEKLY EX- TIRUPATI ON SUN, EX- SRIKAKULAM ROAD ON MON |
| PRIMARY MAINTENANCE | TIRUPATI WITH RBPC |
| WATERING | RENIGUNTA, VIJAYAWADA |
| CTS | RENIGUNTA, VIJAYAWADA |
| COMPOSITION | LWACCN-15, LWCBAC-1 … (LIE OVER RAKE OF 22705/22706 TIR… …RESS) |

శ్రీకాకుళం రోడ్ నుంచి తిరుపతికి వెళ్లే హం సఫర్ ఎక్స్ ప్రెస్ రైలు నంబర్ 17440 ఈనెల 13న ప్రారంభం కానుంది. ఇది శ్రీకాకుళం రోడ్డులో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరుతుంది. అక్కడి నుంచి చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి మంగళవారం ఉదయం 8 గంటలకు చేరుకుంటుంది. అలాగే తిరుపతి నుంచి హం సఫర్ ఎక్స్ ప్రెస్ రైలు నంబర్ 17439 ఈనెల 19న ప్రారంభం కానుంది. ఈ రైలు ప్రతీ ఆదివారం సాయంత్రం 4.55కు తిరుపతిలో బయలుదేరుతుంది. అక్కడి నుంచి రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, బాపట్ల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్ల కోట, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌కు సోమవారం మధ్యాహ్నం 12.30కు చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లలోనూ థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్ కోచ్ లు మాత్రమే ఉంటాయి. ఈ రైలును శ్రీకాకుళం రోడ్డులో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించనున్నారు.

## భగీరథపురంలో నమస్తే ఎచ్చెర్ల

* ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్ * పలు రహదారుల నిర్మాణాలు ప్రారంభం




లోపలి పేజీల్లో..

## కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం

* స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి * టీడీపీ పలాస సమన్వయకర్త వెంకన్నచౌదరి * కార్యకర్తలు, నాయకులు, గ్రామస్థులతో విస్తృత సమీక్షలు * పలాస నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





* స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి * టీడీపీ పలాస సమన్వయకర్త వెంకన్నచౌదరి * కార్యకర్తలు, నాయకులు, గ్రామస్థులతో విస్తృత సమీక్షలు * పలాస నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన

# కలిసికట్టుగా పనిచేస్తేనే.. విజయం



**మందస, ఏప్రిల్ 12(వార్త):** రానున్న స్థానిక ఎన్నికలకు కలసి కట్టుగా పని చేస్తే విజయం సొంతమవుతుందని తెలుగుదేశం పార్టీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త వై.వెంకన్నచౌదరి అన్నారు. మందస మండలంలోని చీపి, సాబకోట, నర్సింగపురం, సువర్ణాపురం, సరియాపల్లి పంచాయతీలలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు జరిపారు. ఆయా సమావేశాలలో వెంకన్నచౌదరి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, స్థానిక ఎన్నికల్లో టిడిపి విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, సంక్షేమ పథకాలు వివరించాలన్నారు. పంచాయతీలలో ఉన్న సమస్యలపై ఆయా పంచాయతీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై భరోసా కల్పిస్తూ, పంచాయతీ పరిధిలోని వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, ఆయా అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేశారు. పర్యటనలో భాగంగా వెంకన్నచౌదరి గ్రామ గ్రామాన అపూర్వ స్వాగతం పలుకుతూ, అడుగు అడుగున ఆత్మీయత, మమత పంచుతూ గ్రామ పంచాయతీ ప్రజలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వీసీతో పాటు, మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, కార్యదర్శి సాలిని మాధవరావు, క్లస్టర్ ఇంచార్జ్ దాసరి తాతారావు, కొర్ల కన్నారావు, చంద్రశేఖర్ ముంజేటి, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, డుంకురు తిరుపతి, అడ్డి ఈశ్వరరావు, బేసి ఈశ్వరరావు, దేబాసిస్ పండా, మండల తెలుగు యువత అధ్యక్షుడు బౌగాన ఈశ్వరరావు, హరీష్ గోర్లే, నవీన్ యాదవ్, అందాల గిరి, మామిడి తాతారావు, మండల లచ్చయ్య, ఆయా పంచాయతీల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## స్థానిక ఎన్నికల్లో సమష్టిగా పనిచేద్దాం

* టీడీపీ విజయానికి కృషి చేయాలి * గ్రామ అభివృద్ధి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
* పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి

**పలాస/వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 12 (వార్త):** స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి టిడిపి విజయానికి కృషి చేయాలని, గ్రామల అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పలాస నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కర్త వెంకన్న చౌదరి అన్నారు. ఆదివారం వజ్రపుకొత్తూరు మండలం పెద్దబొడ్డపాడు, కొండవూరు, హుకుంపేట, మంచినీళ్లు పేట గ్రామాలలో పర్యటించి కార్యకర్తల సంక్షేమానికి పార్టీ బలోపేతానికి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్బంగా స్థానిక నాయకులు, కార్యకర్తలుతో గ్రామాలలో జరిగిన అభివృద్ధి సంక్షేమం, జరగవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలలో అందరూ ఐక్యమత్యంగా పనిచేసే పార్టీ ప్రతిష్టకు ప్రణాళికలు వేసి ముందుకు వెళ్లాలని చెప్పారు. ఆయా మత్స్యకార పంచాయతీల సందర్శించి మత్స్యకారులు సమస్యలు వింటూ గ్రామలో మిగిలిన అభివృద్ధి కార్యక్రమాల కోసం చర్చించారు. ఆయాగ్రామాలలో అభివృద్ధి గూర్చి హామీ ఇచ్చారు. ఆయన దగ్గరకు వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముఖ్య నాయకులు, అధ్యక్ష కార్యదర్శులు, యూనిట్, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

**పలాస, ఏప్రిల్ 12 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు టిడిపి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పలాస నియోజకవర్గ సమన్వయ కర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. పలాస నియోజకవర్గంలోను గ్రామ పంచాయతీలను ఆదివారం విస్తృత పర్యటన చేశారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామ పంచాయతీ ఎన్డిఏ పనులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, సంక్షేమ పథకాలు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, జిల్లా గ్రంధాలయం చైర్మన్ పీరుకట్ల విఠల్ రావు, పలాస మండలం అధ్యక్షులు, రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుమ్ లక్ష్మణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి



కూటమి నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పలాస నియోజకవర్గ సమన్వయ కర్త వెంకన్న చౌదరి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, స్థానిక ఎన్నికల్లో టిడిపి విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి దువ్వాడ సంతోష్ రామ్ నాయుడు, 4వ క్లస్టర్ ఇంచార్జి మురుపింటి కుమార్ రాజ్, యూనిట్ కన్వీనర్ పుచ్చ భాస్కరరావు, బొడ్డు దుష్యంత్, తామాడ అప్పారావు మండల సమన్వయ కమిటీ సభ్యురాలు మామిడి కమల,తెలుగు యువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పిడుగు మృతుల కుటుంబానికి నీలకంఠం పరామర్శ

**మందస, ఏప్రిల్ 12(వార్త):** మందస మండలంలోని నారాయణపురం పంచాయతీ పెద్దకేశుపురం గ్రామంలో జరిగిన పిడుగు పాటుకు తల్లీ, కుమార్తెలు అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ జుత్తు జగన్నాయకుల సోదరుడు, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల పెద్దకేశపురంలో జీడిమామిడి తోటలోల పిడుగుపాటుకు తల్లి కృష్ణకుమారి, కుమార్తె యోగేశ్వరి మరణం మరణించారు. మరణించిన తల్లీ, కుమార్తె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రకృతి ప్రకోపానికి బలైన పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠంతో పాటు గ్రామపెద్దలు మడియా రామకృష్ణ, పెద్దలు తెప్పల పోలయ్య, మాజీ సర్పంచ్ నీలవేణి ఉన్నారు.



# 'సీదిరి' సన్మానంతో వైసీపీ నాయకుల జోష్

* సేవలకు గుర్తింపుతో 'మాజీ సర్పంచ్'లు ఫిదా
* మరింత ఉత్సాహంతో కదనరంగానికి కేడరు



**మందస, ఏప్రిల్ 12(వార్త):** ప్రజలకు సేవ చేయడం ఓ అదృష్టం.. సేవలకు గుర్తింపు దొరకడం మహాభాగ్యం.. ఐదేళ్ల పాటు నిరంతరం అభివృద్ధే ధ్యేయంగా.. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేసిన సర్పంచ్ లు తాము పడిన శ్రమకు గుర్తింపు దొరకడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మందస మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్పార్టీ తరుపున సర్పంచ్ పదవులకు పోటీ చేసి, విజయం సాధించిన ఆ పార్టీ నాయకులు ఐదు సంవత్సరాల పాటు బాధ్యతలు నెరవేర్చారు. పదవీ కాలం ముగియడంతో వారు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గుర్తించారు. పార్టీ తరుపున పోటీ చేసి, విజయం సాధించిన సర్పంచ్ లతో పాటు వారి సతీమణులకు కూడా ఒకే వేదిక సన్మానించడానికి నిర్ణయించారు. అదేవేదికపై పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వారి సతీమణులకు, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన సర్పంచ్ లు, వారి సతీమణులకు కూడా పలాసలో సత్కరించారు. తాము చేసిన సేవలకు అధినాయకుడు అప్పలరాజు, ఆయన సతీమణి శ్రీదేవి చేతుల మీదుగా ఘనంగా సన్మానం పొందడంతో వారంతో ఆనందంతో ఉన్నారు. గ్రామస్థాయిలో పార్టీకి పునాదులు కార్యకర్తలు.. వారంతా దాదాపుగా సర్పంచ్ ఆధ్వర్యంలోనే పని చేస్తారు. ఈ సన్మానంతో కార్యకర్తల్లో కూడా జోష్ పెరిగింది. ఎన్నడూలేని విధంగా తమ సేవలను పార్టీ గుర్తించడంతో మాజీ సర్పంచ్ లు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎన్నికలు దగ్గర్లోనే ఉన్నాయి. ఇందు కోసం రాజకీయ పార్టీలు వేచి చూస్తున్నాయి. ఈ తరుణంలో సన్మానం పొందిన మాజీ సర్పంచ్ లు ఉత్సాహంగా కదనరంగంలో దూకడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారిలో కొంతమంది మళ్లీ సర్పంచ్ లుగా పోటీ చేయడానికి సిద్ధపడతుండగా, తెరపైకి కొత్త ముఖాలు వచ్చే అవకాశం ఉంది. ఏమైనా.. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలు తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్యే ఉంటుంది. ఎవరి ప్రయత్నాల్లో వారు ఇప్పటికే నిమగ్నమయ్యారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎవరి సత్తా ఏమిటో తేలిపోతుంది.

### సన్మానం కొత్త ఉత్సాహమిచ్చింది..

మూలిపాడు ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా ఎంతో శ్రమించానని మూలిపాడు మాజీ సర్పంచ్ గుసిరి వెంకటరావు అన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించానని, మా నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్ని విధాలా సహకరించారన్నారు. తాము చేసిన సేవలను గుర్తించి.. నాతో పాటు నా సతీమణి సరస్వతిని కూడా ఘనంగా సన్మానించడంతో ఎంతో ఆనందానికి గురయ్యానన్నారు. రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పని చేస్తామని తెలిపారు.




## జానపదం 'దాసరి' ప్రతిభకు గుర్తింపు

* 'తాతారావు'కు ప్రతిభా పురస్కారం

**మందస, ఏప్రిల్ 12(వార్త):** మందస ఉద్దానానికి మరోసారి గుర్తింపు వచ్చింది. జానపదానికి ప్రతిభా పురష్కారం లభించింది. మందస మండలంలో జానపద కళాకారులకు కొదువలేదు. మందస మండలంలోని ఉద్ధాన ప్రాంతమైన లొహరిబంద పంచాయతీ, గొల్లలపాలేం గ్రామానికి చెందిన దాసరి తాతారావు మంచి జానపద కళాకారుడు. మహాత్మా జ్యోతిబాపూలె ద్విశతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభిన్న రంగాలకు చెందిన ప్రతిభావంతులకు సన్మానించడం జరిగింది. దీనిలో భాగంగా తాతారావును కూడా రాష్ట్ర మంత్రులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దాసరి తాతారావు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు తమ కళా నైపుణ్యంతో పునీతం చేసిన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర మంత్రులు, అధికారులచే ప్రతిభా పురస్కారం అందుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. జానపద కళలు రంగంలో ఎంపిక చేసి ఈ స్థాయిలో గుర్తింపు లభించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కార్యక్రమంనకు హాజరైన బీసీ మంత్రి సవితమ్మ, కింజరాపు అచ్చన్నాయుడు, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, వివిధ కార్పొరేషన్ ల చైర్మన్‌లు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మా శాసన సభ్యురాలు గౌతు శిరీష అందరికీ పేరు పేరున ధన్యవాదములు అర్పిస్తున్నామన్నారు. నా ఉన్నతికి కారకులు అయిన జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, నా సహధర్మచారిణికి, నా చిన్నతనం నుండి కళలు పట్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా అనురక్తి కలిగించడానికి ప్రేరేపితులైన గురువులకు నా పాటలను ఆస్వాదించి నిరంతరం ప్రోత్సహించిన నా స్నేహితులకు, శ్రేయోభిలాషులకు రుణపడి ఉంటానని దాసరి తాతారావు పేర్కొన్నారు.



## 14న మందసలో అయ్యప్పస్వామి పుట్టిన రోజు వేడుకలు



**మందస, ఏప్రిల్ 12(వార్త):** మందస పట్టణంలోని బొట్టేశ్వరస్వామి సన్నిధానంలో ఈ నెల 14న అయ్యప్పస్వామి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు గురుస్వామి సురేష్ కుమార్ రథో, అయ్యప్ప భక్తులు తెలిపారు. ఉదయం నుండి రాత్రి పడి పూజలో భక్తులు పాల్గొనాలని కోరారు.

## మాజీ కౌన్సిలర్ ప్రేమ్ కుమార్ మృతి



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 12 (వార్త):** పురుషోత్తపురం మాజీ కౌన్సిలర్ నందిక ప్రేమ్ కుమార్ (42) గుండెపోటుతో ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన 2000 నుండి 2005 మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌గా పనిచేశారు. 516 ఓట్ల భారీ మెజారిటీతో అప్పటి పాలకవర్గంలో గెలుపొందారు. విశాఖపట్నంలో స్థిర పడిన ప్రేమ్ కుటుంబ సభ్యులతో ఓ శుభకార్యానికి హాజరు అయ్యేందుకు ఇచ్ఛాపురం వచ్చారు. తొలుత గుండె నొప్పి రాగా స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఇంట్లో మరోసారి గుండెపోటు రావడంతో మృతి చెందారు. రాష్ట్ర లారీ యజమానుల సంఘం నాయకులు ముడియా జానకి రాం రెడ్డి కుమార్తెను వివాహమాడారు. ఆయనకి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## యథేచ్ఛగా బెల్ట్ షాపులు



**సారవకోట, ఏప్రిల్ 12(వార్త):** సారవకోట మండలంలో ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న మద్యం దుకాణాలు పరిమితంగా ఉండగా, బెల్ట్ షాపులు మాత్రం ఊరి కొకటి రెండు చొప్పున వెలిశాయి. బొంతు జంక్షన్, సారవకోట, అలుదు గ్రామాల్లో మాత్రమే లైసెన్స్ పొందిన షాపులు ఉన్నప్పటికీ, వాటి పరిధిలోనే వందలాది బెల్ట్ షాపులు విచ్చలవడిగా ఏర్పడ్డాయి. అధికారిక దుకాణాల కంటే అక్రమ విక్రయాలే ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి అక్రమ దుకాణాలపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత పోలీస్ యంత్రాంగం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ఒకలా ఉండగా, అమలులో మాత్రం భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బెల్ట్ షాపుల నియంత్రణపై అధికారులు ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు ఎక్సైజ్ స్టేషన్లో వాహనాలు వేలం

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 12 (వార్త):** స్థానిక ప్రొహిబిషన్అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టు బడిన వాహనాలు సోమవారం వేలం వేస్తున్నట్లు సీఐ పి దుర్గా ప్రసాద్ చెప్పారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు మేరకు ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

## శ్రీకాకుళం నగర పరిధిలో డ్రోన్ నిఘా

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 12 (వార్త):** శ్రీకాకుళం ఒకటో, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరసవిల్లి, ఖాజీపేట, భైరవానిపేట, శాంతినగర్ కాలనీ, నాగావళి రివర్ వ్యూ పార్క్, బలగ తదితర నదీ పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాలలో నిర్మానుష్య ప్రదేశాలలో డ్రోన్‌లతో పోలీసులు నిఘా పెట్టారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు గుర్తించబడిన పక్షంలో, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. అలాగే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



## వైభవంగా తులసమ్మ వార్షిక సంబరం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్12 (వార్త):** లొద్దపుట్టి ధనారాజ తులసమ్మ వార్షిక సంబరం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా చైత్ర మాసంలో ఉగాది తర్వాత రెండో ఆదివారం సంబరం గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని పర్యవేక్షణ చేపట్టింది. మండుటెండలు సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ పూజల్లో పాల్గొన్నారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.




# నిబద్ధత కలిగిన నాయకుడు 'మట్ట వల్లయ్య'

* మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు * సంతాపసభలో నివాళులు అర్పించిన నాయకులు

**మందస, ఏప్రిల్ 12(వార్త):** రాజకీయాలతో పాటు సామాజికపరంగా కూడా మట్ట వల్లయ్య ఎంతో నిబద్ధతతో ముందుకు సాగారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలోని భైరిసారంగపురం గ్రామంలో మట్ట వల్లయ్య సంతాపసభ జరిగింది. కార్యక్రమంలో సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ విలువలు కలిగిన రాజకీయ నాయకునిగా వల్లయ్య తన జీవితాన్ని కొనసాగించారని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతమే లక్ష్యంగా పని చేశారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పని చేసిన వల్లయ్య మరణంతో ఓ మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. వల్లయ్య భార్య మట్ట లక్ష్మమ్మ భైరిసారంగపురం ఎంపీటీసీగా పని చేస్తున్నారు. వల్లయ్య రాజకీయ జీవితమంతా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగిందని, ముందుగా ఆయన మజ్జి తులసీదాసు, మజ్జి శారదలకు ముఖ్య అనుచరునిగా పని చేశారు. అనంతరం వైఎస్ జగన్మోహన్రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించాక అప్పటి నుంచి వైకాపాలోనే కొనసాగుతున్నారు. వల్లయ్య కుమారుడు షణ్ముఖరావు రాజకీయాల్లో చురుకుగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. వల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ మట్ట రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, పార్టీ నాయకులు మురపాల నారాయణరావు, చింతాడ గణపతి, బేపల తిరుపతిరెడ్డి(చిన్న), బాడ జగన్నాయకులు, పైల వెంకటరావు(చిట్టి), శిస్టు గోపి, మాజీ సర్పంచ్ గుసిరి వెంకటరావు, యవ్వారి నాగేశ్వరరావు, కర?న గోపాలకృష్ణ, సురేష్ కుమార్ పాణిగ్రాహి, శిస్తు బాపూజీ, బతకల మోహనరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొర్ల హేమారావుచౌదరి, పైడి కర్రి చంద్రయ్య, పట్టాభిరామారావు తదితరులు పాల్గొన్నారు.



## జోహార్ ఖాన్ కుటుంబానికి..
# వైసీపీ నేతల పరామర్శ



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 12 (వార్త):** జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ దంపతులను రాష్ట్ర మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్ పరామర్శించారు. జోహార్ ఖాన్, సయ్యదా సుల్తానా దంపతుల కుమారుడు ప్రేమ్ సర్తజ్ ఖాన్ అకాల మరణం చెందారు. వివిధ కార్యక్రమాల నిమిత్తం ఇచ్ఛాపురం విచ్చేసిన ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, ఇతర వైసీపీ నేతలతో కలిసి జోహార్ ఖాన్ గృహానికి విచ్చేసి పరామర్శించారు. తమ సానుభూతిని తెలియజేశారు. ప్రేమ్ ఖాన్ గూర్చి వివరాల అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసిపి నేతలు సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్, పిలక రాజ్యలక్ష్మి, మామిడి శ్రీకాంత్, పైల దేవదాస్ రెడ్డి, పిలక సంతోష్ తదితరులు ఉన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సూర్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు



**సంతబొమ్మాళి, ఏప్రిల్ 12(వార్త).** మండల కేంద్రం సంతబొమ్మాళిలో వెలసిన సూర్య నారాయణ స్వామి ఆలయం లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు, ఆలయం పూజారి సుసరాపు శ్రీకాంత్ శర్మ (గున్నుబాబు) ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, సూర్య హోమం జరిపించారు. ఆలయం ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం అనంతరం నిత్యపూజలు జరుగుతున్నప్పటికి మొట్టమొదటి ఈ ఆదివారం సూర్య హోమం, నమస్కారంలు దినేష్ శర్మతో జరిపించారు. ఈ ఆలయంలో ఇప్పటినుంచి ప్రతి ఆదివారం ఉదయం 9గంటలకు ఈ ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు, హోమం కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు పప్పు రాజు తెలిపారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని ఆరోగ్య ప్రదాత ఆశీస్సులు పొందాలన్నారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు.


## గ్యాస్ పంపిణీ కాక వినియోగదారుల ఇక్కట్లు

**సంతబొమ్మాళి, ఏప్రిల్ 12(వార్త):**బోరుభద్ర ప్రాంతానికి హెచ్.పి.గ్యాస్ పంపిణీ కాక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరుభద్ర ప్రాంతానికి నరసన్నపేటకు చెందిన సాయి స్వర్ణ హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ నుండి గ్యాస్ సరఫరా అవుతుంది. ఈ ప్రాంతంలో ఈ ఏజెన్సీ ద్వారా సుమారు వెయ్యి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే గత ఇరవై రోజులుగా ఈ ప్రాంతానికి సంబంధించిన ఏజెన్సీ ద్వారా గ్యాస్ సరఫరా కాక పోవడంతో గ్యాస్ లేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు, ఆన్‌లైన్‌లో వినియోగదారులకు ఓటిపిలు వచ్చినా ఇరవై రోజులయినా ఇప్పటికీ గ్యాస్ సరఫరా కావడం లేదు. సంబంధిత ఏజెన్సీకి ఫోన్ల ద్వారా సంప్రదిస్తున్నా స్పందించడం లేదు. జిల్లా అధికారులు స్పందించి బోరుభద్రకు నరసన్నపేట సాయిస్వర్ణ సంస్థ ద్వారా గ్యాస్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం,ఏప్రిల్12 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు నేరుగా గాని, ఆన్లైన్‌లో మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదైన అర్జీల గురించి, వాటి స్థితి కోసం సమాచారం కోసం 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. రెవెన్యూ క్లినిక్ లో (రెవెన్యూ సమస్యలపై) అర్జీలు స్వీకరించబడతాయన్నారు.

## సోంపేటలో కేర్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



**సోంపేట, ఏప్రిల్ 12 (వార్త):** సోంపేట పట్టణంలో ఉద్దానం కేర్ హెల్త్ క్లినిక్‌ను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉద్దానం ప్రజలకు అందుబాటులో వైద్యాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా ప్రజల చెంతకు ఆరోగ్య సేవలు అందించే లక్ష్యంతో కేర్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. క్లినిక్ ఫార్మసీ అధునాతన ల్యాబ్ ఫిజియోథెరపీ వంటి సేవలు ఎక్కడ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గొరకల గిరిబాబు, డాక్టర్ యూత్ దివ్య, మేనేజర్ జత్తు జీయన్న, స్థానిక వైద్యులు పాల్గొన్నారు.

## పలువురికి ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శ



**పలాస, ఏప్రిల్ 12 (వార్త):** ఇటీవల కాలంలో మృతి చెందిన కుటుంబాలను ఆదివారం పలాస ఎమ్మెల్యే గౌతుశిరీష పరామర్శించారు. నియోజకవర్గంలోని ఇటీవల కాలంలో మరణించిన పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిది గాలి కృష్ణారావు అత్త, సంబాన లోకేష్, చంద్రశేఖర్ త్యాడి బావ, అల్లుకోల గ్రామం పైల తులసమ్మ , రెంటికోట గ్రామం రెయ్యి కుమారస్వామి, కైజోల గ్రామం తెప్పల మధు వారి కుటుంబాలను పరామర్శించి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. ఆయా కుటుంబాలకు టిడిపి అండగా నిలుస్తుందని, ఎటువంటి సహాయం కావాలన్నా తనని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ పీరుకోట్ల విఠల్, టిడిపి నాయకులు లోడగల కామేశ్, బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్తా, చంద్రశేఖర్ త్యాడి, కొవ్వూరు సురేష్ కుమార్, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెళియాపుట్టిలో బయటపడిన అయ్యప్ప విగ్రహాలు



**మెళియాపుట్టి, ఏప్రిల్ 12 (వార్త):** మెళియాపుట్టి మండల కేంద్రంలో శిరిడి సాయి ఆలయానికి సమీప దూరంలో నున్న ఖాళీ స్థలంలో అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం బయటపడింది. మెళియాపుట్టి గ్రామానికి చెందిన రుషి, అభిషేక్ అనే ఇద్దరు పిల్లలు మేకలను తీసుకువెళ్ళి ఆడుతుండగా విగ్రహం చేయి కనిపించిందని అనుమానం వచ్చి తవ్వగా విగ్రహం బయటపడింది. అనంతరం తమ పెద్దలకు తెలియజేయడంతో ఈ నోటా నోటా గ్రామమంతా అయ్యప్ప స్వామి వెలిశారని దావాణంలో వ్యాపించడంతో అయ్యప్ప స్వామి భక్తులతో పాటు గ్రామస్తులు ఆ ప్రాంతానికి తరలివచ్చారు.

## నేలకు జీవం... ఘనజీవామృతం

**సోంపేట, ఏప్రిల్ 12 (వార్త):** నేలకు మంచి జీవాన్ని ప్రసాదించి నేలలో దాగి ఉన్న సూక్ష్మజీవులను ఉత్తేజితం చేసి నేలకు మంచి ప్రాణవాయువుల ఉపయోగపడే ఘనజీవామృతాన్ని రైతులు తప్పనిసరిగా ఉపయోగించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పేర్కొన్నారు. కుమ్మరిపాడు గ్రామంలో ఆదివారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఘనజీవామృతం సూక్ష్మజీవులను నేలలో ఉత్తేజపరుస్తుందని మొక్కకు అవసరమైన పోషకాలను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 500 కిలోల ఘనజీవామృతాన్ని తయారు చేశారు. అలాగే రానున్న ఖరీఫ్ లో వర్షాభావ పరిస్థితులు ఉండవచ్చని హెచ్చరికల నేపథ్యంలో పరిస్థితులను తట్టుకునేందుకు అవసరమైన విత్తన గుళికలను కూడా తయారుచేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎమ్టి జి.కూర్మారావు, ఐసిఆర్‌పి డి పుష్పలత, స్వాతి, దేవమ్మ, శ్రావణి, మహేష్, జయలక్ష్మి, హైమావతి, తిరుమల పాల్గొన్నారు.



## భగీరథపురంలో నమస్తే ఎచ్చెర్ల

- ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్
- పలు రహదారుల నిర్మాణాలు ప్రారంభం

**ఎచ్చెర్ల, ఏప్రిల్12 (వార్త):** ఎచ్చెర్ల మండలం భగీరథపురంలో శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం 'నమస్తే ఎచ్చెర్ల' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 29 లక్షల విలువైన పలు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ






సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతామన్నారు. అధికారుల సమక్షంలో పలు సమస్యలపై నేరుగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. అన్ని గ్రామాలకు రహదారులు, డ్రైన్లు నిర్మిస్తామన్నారు. సమస్యలు ఉంటే నేరుగా తనను కలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## భరోసా కల్పించడమే.. కొరికన ఫౌండేషన్ ధ్యేయం

- సుడా చైర్మన్ రవికుమార్

**మెళియాపుట్టి ఏప్రిల్ 12 (వార్త):** తమకు తోచిన విధంగా ప్రజలకు సేవ చేస్తూ గ్రామాల అభివృద్ధి చేయడంతో పాటు ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారికి మరింతగా సేవ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కొరికన ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామని సుడా చైర్మన్ కొరికన రవికుమార్, భవానీ తెలిపారు. మాకు తోచిన సహకారాన్ని ఎల్లప్పుడూ ప్రజలకు సహకారం అందిస్తామన్నారు. మెళియాపుట్టి మండల పరిధిలో గల ముక్తాపురం గ్రామానికి చెందిన వికలాంగుడు బండారు అప్పారావుకి కొరికాన ఫౌండేషన్ ద్వారా సుమారు 3 లక్షలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. కొరికన ఫౌండేషన్ ద్వారా వారు అందించిన మూడు లక్షల రూపాయలతో వికలాంగుడు అప్పారావు తన గ్రామంలో స్థానికంగా కంటైనర్‌లో కిరాణా, జిరాక్స్ షాపును ఆదివారం కొరికాన రవికుమార్, పాతపట్నం నియోజకవర్గం జనసేన నాయకురాలు కొరికాన భవానీలు స్వయంగా ప్రారంభించి ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మెళియాపుట్టి మండలం జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, వసుంధర మాజీ సర్పంచ్ సలాన అప్పలనాయుడు, పిట్ట చంద్రశేఖర్, లక్ష్మిపురం కిరణ్ కుమార్, సవర రామమూర్తి, బండారు మధు, పల్లి ప్రవీణ్, తరకేశ్వరరావు, గుమ్మడి హరిశంకర్, దొర విజయ్ కుమార్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## చూసి బాధపడ్డారు... చేసి చూపించారు!

**పలాస, ఏప్రిల్ 12 (వార్త):** "సొంత ఊరికి సేవ చేస్తే... అదే మానవత్మని! గోవిందపురంలో ఆదర్శ దంపతులు చేసి చూపించారు. 'డబ్బు ముఖ్యం కాదు... సేవే మాకు అసలు లక్ష్యంగా.. భావించి గోవిందపురంలో ఆదివారం 25 లక్షల భోజనశాల నిర్మాణమును ప్రారంభించారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం గ్రామం మరోసారి ఆదర్శంగా నిలిచింది. సొంత గ్రామ అభివృద్ధి కోసం ముందుకొచ్చిన కొంచాడ గోవిందరావు, సుకన్య దంపతులు మాటలకే పరిమితం కాకుండా కార్యరూపంలో చూపించి గ్రామ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు భోజనం సమయంలో పడుతున్న ఇబ్బందులను గమనించిన ఈ దంపతులు తక్షణమే స్పందించి రూ.25 లక్షలతో కార్పొరేట్ స్థాయి ఆధునిక భోజనశాల





భవనాన్ని నిర్మించి, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేశారు. ఈ భవనం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పాల్గొని, దంపతులను శాలువ కప్పి సన్మానం చేసి, జ్ఞాపికను అందించి ఈ సేవా కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కటే కాదని గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని, కొంచాడ దంపతులు చూపించిన మార్గం అనుసరించదగినదని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం అంటే భవిష్యత్ దేశ నిర్మాణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గణేష్, కోఆప్షన్ సభ్యులు విఘ్నేష్, శంకర్ టిడిపి సీనియర్ నాయకులు నారాయణ, తుంభనాదం ఉపాధ్యాయులు, పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శిథిలావస్థలో వంతెన

**సారవకోట, ఏప్రిల్ 12 (వార్త):** సారవకోట మండలం పదంపురం జంక్షన్ నుంచి సత్రం వెళ్లే మార్గంలో ఉన్న చిన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రమాదంగా మారింది. సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం తీవ్రంగా దెబ్బతిని ఎప్పుడైనా కూలిపోవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానికుల ప్రకారం, చిన్నపాటి బరువు వాహనం వెళ్లినా వంతెన కూలిపోయే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. రోజువారీగా ఈ మార్గాన్ని ఉపయోగించే గ్రామస్తులు భయంతో ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ రహదారి ద్వారా పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడంతో పాటు వ్యవసాయ పనులకు కూడా ఉపయోగిస్తున్నారు. అయితే వంతెన దుస్థితి కారణంగా రవాణా అంతరాయం కలుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వంతెన పరిస్థితిని పరిశీలించి, కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ఈ వంతెనను వెంటనే పునర్నిర్మించడం ద్వారా ప్రమాదాలను నివారించి, ప్రజలకు సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పల్లెల అభివృద్ధే మా లక్ష్యం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 12(వార్త):** పల్లెల అభివృద్ధికి కూటమి సర్కారు కట్టుబడి ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం రూరల్ మండలం, రాగోలు పంచాయతీ, రాయపాడు పంచాయతీ పరిధిలో 46 లక్షల రూపాయల ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కూటమి శ్రేణులతో కలసి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. పల్లెలకు అన్ని వైపులా ఇతర ప్రాంతాలను కలుపుతూ రోడ్లను నిర్మించడం వల్ల.. వేగంగా అభివృద్ధి చెందుతాయని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సీర రమణయ్య, చిట్టి మోహన్, గేదెల శ్యామల రావు, బలగ చెంగల రావు తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

**జలుమూరు, ఏప్రిల్ 12 (వార్త):** జలుమూరు మండలం కరవంజలోని ఏపీ మోడల్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివ కుమార్ తెలిపారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 315 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 305 మంది పరీక్షలకు హాజరయ్యారని, 10 మంది గైర్హాజరైనట్లు వివరించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేసినట్లు తెలిపారు. సరైన ఏర్పాట్ల మధ్య ప్రవేశ పరీక్షలు సాఫీగా పూర్తవడంతో విద్యార్థులు తదుపరి ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**పోలాకి:** పోలాకి మండలం ఈదులవలసలోని ఏపీ మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ పైడి ప్రవీణ తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 344 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 332 మంది పరీక్షకు హాజరయ్యారని, 12 మంది గైర్హాజరైనట్లు వివరించారు. పరీక్షను ఎటువంటి అంతరాయాలు లేకుండా సజావుగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి యు. శాంతారావు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## ముగిసిన జనగణన శిక్షణ మొదటి విడత



**జలుమూరు, ఏప్రిల్ 12 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు జలుమూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జనగణన తొలి విడత సర్వే శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొని జనగణన ప్రక్రియపై సమగ్ర అవగాహన పొందారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె. రామారావు మాట్లాడుతూ, జనగణన సర్వేలో భాగంగా గ్రామాల వారీగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ గణనలో ముఖ్యంగా 34 అంశాలపై సమాచారాన్ని నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జనాభా లెక్కలు ఖచ్చితంగా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని, అందుకు సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలు కూడా సహకరించి సరైన సమాచారం అందించాలని కోరారు. అలాగే, జనగణన శిక్షణ రెండో విడత సోమవారం నుంచి తిరిగి ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో సమగ్ర అవగాహన పెంపొందించి, జనగణన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## సీజ్ చేసిన బాణసంచా నిర్వీర్యం

**సారవకోట, ఏప్రిల్ 12(వార్త):** సారవకోట మండలంలో గతంలో వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ బాణాసంచాను పోలీసులు నిర్వీర్యం చేశారు. సారవకోట పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఎస్ఐ అనీల్ కుమార్ తెలిపారు. గత ఏడాది దీపావళి సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన బాణాసంచాను పోలీసులు పట్టుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు ఆ బాణాసంచాను నిర్వీర్యం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, అక్రమంగా పేలుడు పదార్థాలు నిల్వ చేయడం చట్టవిరుద్ధమని, ప్రజలు నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

**జలుమూరు, ఏప్రిల్ 12 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్థానిక ప్రజలు సహకరించాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. జలుమూరు మండలం టెక్కలిపాడు ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం రాత్రి గొల్లపేట తదితర గ్రామాల్లో ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెడ్‌మాస్టర్ ఏ. కుమార్ నాయకత్వం వహించారు. గ్రామాల వారీగా ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడేందుకు ఇవి ఉత్తమ వేదికలని తెలిపారు. పలు పోటీ పరీక్షలు, విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫార్ములు వంటి సదుపాయాలు విద్యార్థులకు అందుతున్నాయని, తల్లిదండ్రులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ డ్రైవ్‌లో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొని విద్యార్థుల చేర్పులపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం సామూహికంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు సూచించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546